# మీ టాలెంట్‌షో చూశాక.....



**అమృతలత గారికి,**

ప్రతీదీ వ్యాపారంగా భావించే ఈ రోజుల్లో - విద్యార్థులకోసం ఇంత నిస్వార్థంగా అలసటను లెక్కచేయకుండా, నిరంతరం శ్రమిస్తోన్న మిమ్మల్ని అభినందించకుండా ఎవరుండగలరు !?

అతిథులకు స్వాగతం చెప్పే సమయంలో 'జింగిల్ బెల్స్' గీతం వింటూంటే నేనూ మీ స్కూలు విద్యార్థినైతే బావుండుననిపించింది !

ఎప్పుడో... ప్రపంచ తెలుగు మహాసభల్లో... చిన్నారుల ఆటపాటలు చూశాం! మీ పుణ్యమా అని ఏడాదికోసారి ఇలా చూడ గలుగుతున్నాం! పిల్లలు ప్రదర్శించే ఆటపాటల వెనుక మీ శ్రమా, ఖర్చు, ప్రయాసా... వీటితో పాటు ప్రతిభా పాటవాలు కన్పిస్తాయి ! 'అత్తసూడే సిన్న బావా', 'గండర గండ కొండ జాతి చిన్నది' లాంటి పాటలు ఎప్పటికీ మరువలేం ! రచనల్లోనూ, దర్శకత్వ బాధ్యతలోనూ మీ సామర్థ్యం సదా ప్రశంసనీయం !

**- సురూపా శరత్‌రావ్, ఆర్మూర్,**

(16వ టాలెంట్‌షో చూశాక....)

10-12-1996

---



**కవితా మేడం గారికి,**

మీ 23వ 'టాలెంట్‌షో' ప్రభావం నామీద ఇంకా ఎంత కాలం ఉంటుందో చూద్దాం, అంతవరకూ ఆగుదామని, ఇంతకాలం లెటర్ వ్రాయలేదు. అంతేకాదు - మరో కారణం కూడా ఉంది! 'మెచ్చుకోలు'ను ఎలా చెప్పాలో'.. అలాగే చెప్పాలి ! నా మెచ్చుకోలు మీకు నచ్చుతుందో లేదో అనీ అది ముందు నాకు నచ్చాలనీ.... ముఖ్యంగా నా విశ్లేషణ మీ 'ప్రతిభ' ని సరిగ్గా గుర్తించేదై ఉండాలి, ఇదీ నా ఆలోచన !

'యమునా తీరమున...' చక్కటి నాట్యం ! అభినయం అమోఘం ! రాధా కృష్ణుల్ని రంగస్థలం మీద దర్శించిన నా అంతరంగం భక్తి పారవశ్యంతో ఉప్పొంగింది. నాట్యం అయిపోయినా తనువంతా పొంగిన పులకాంకురాలూ..., ఆనంద బాష్పాలూ... ఇప్పటి వరకూ అనుభూతిగా మిగిలి ఉన్నాయి ! ప్రతి ఏడూ ఇలాంటి భక్తి రసాన్ని పండిస్తారనీ, ఆ పుణ్యం ప్రదర్శించిన మీకూ - దర్శించిన మాకూ దక్కుతుందనీ ఆశిస్తాను.

ఒకమాట అడుగుతాను...'చందమామలూ' డ్యాన్స్‌లో - 'కుళ్ళ బొడవటం అంటే ఏమిటీ' ? కొండచిలు లాంటి దాన్నీ, ఓ పట్టాన చావని విషజీవినీ కుళ్ళ బొడుస్తారు ! కానీ ఇదేంటండీ బాబూ.... కప్ప - ఏం తప్పు చేసిందని దాన్ని కుళ్ళ బొడవటం ? బెకబెక అన్నందుకా ? చాల్లెండి చోద్యం ! కప్ప బెక బెక అనకపోతే - బుస్ బుస్ మంటుందా ? - ఏమిటీ... మీ గడప కింది కొచ్చి బెకబెక అందా, అందు కా ? హన్నా, ఈ కప్ప కెంత భయంలేదు ! ఎక్కడో... మైదానంలో బెక బెక మనుకుంటూ పడిఉండక, గడపకింది కొచ్చి బెకబెక మంటుందా ? అందుకే దాని పనయ్యింది. సర్లెండి !

అదేమిటీ ? 'ఈగ పెంటమీద నుంచి ఇంటిమీది కొస్తే'- అయ్ బాబోయ్ అగ్గిపుల్ల గీసి అంటించడమే!? - మనలో మనమాట ! ఈగ ఎగిరిపోయి... పెంటో, ఇల్లో అంటుకోలేదు కదా ?

ఈ సాహిత్యమెక్కడ దొరికిందండీ బాబూ మీకు ? సెలెక్ట్ చేసుకున్నవారికి దండాలు ? - డ్యాన్స్ కంపోస్ చేసిన మీకూ దండాలమీద దండాలు ! 'ఏ సాహిత్యమైనా... దాన్ని ఇట్టే స్ఫూర్తితో కంపోజ్ చేసి పిల్లల చేత ప్రదర్శింప జేయగల సత్తామీది' అని మరొక్కమారు నిరూపించుకొన్నారు. అభినందనలు!

పనిచేస్తారు చాలామంది....; చేయటం వేరు - పనిలో ఏకాగ్రత ఉంచటం వేరు.పనిలో స్ఫూర్తి... దానితోపాటూ సృజనాత్మకత మేళవించటం వేరు ! పనిలో ఏకాగ్రత... నైపుణ్యాన్ని చాటితే - సృజనాత్మకత... 'కళ' అవుతుంది ! అందుకే అప్పట్లో చతుష్షష్టి కళల్ని పేర్కొన్నారు. అయితే మీది '<u>కళలో కళ!</u>' ఇంతకంటే ఏం వర్ణించగలను ?

ఈ యేటి టాలెంట్‌షోకి ముగింపు హైలైట్‌గా మీ రంగ ప్రవేశం ! అది ఆడియన్స్‌ని ఆశ్చర్యచకితుల్ని చేసిందంటే నమ్మండి. మెరుపుతీగ నేలమీదికి వచ్చిందా !? ఇంతకాలం తెరవెనుక నున్న కళ.... ఏమిటీ హఠాత్తుగా స్టేజీమీద తళుక్కుమంది !? క్షణం.. ముందుగా వెళ్ళిపోయి ఉంటే ఆడియన్స్ ఎంత గొప్పసీన్‌ని మిస్సయేవారో?.... ఒకవేళ ఎవరైనా మిస్సయితే వాళ్ళది రియల్లీ బ్యాడ్‌లక్!

అలాగే 'దేవదాసు' హిట్ సాంగ్స్ ఏర్చి కూర్చిన డ్యాన్స్ చూస్తోంటే.... 'పిల్లలు ఈ స్టెప్స్‌ని ఎలా గుర్తు చుకుంటారా అసలు ?' అని బోల్డు ఆశ్చర్యం వేసింది.

మీ సావిత్రి బావుంది, యమధర్మరాజు నటనా బావుంది ! సావిత్రి పాత్రధారి మంచి నటిఅయ్యే హోప్స్ కనబడుతున్నాయి. వీధి నాటకాన్ని తెరకెక్కించ టం - దాంట్లోనూ - 'ఏ రసమైనా సరసంగా ఉంటుంది వీధినాటకంలో'- అనే నిజాన్ని మీదైన శైలిలో చెప్పటం నాకు నచ్చింది! శ్రుతిమించనీయకుండా జాగ్రత్తపడ్డారు. ఇదికూడా మెచ్చుకోదగింది. నాటిక లేదా నాటకంలో ప్రత్యక్షంగా మైక్ ముందు డైలాగ్స్ మాట్లాడటం ఓ పద్ధతి - రికార్డ్‌చేసిన డైలాగ్స్‌కి లిప్ మూమెంట్ ఇస్తూ యాక్షన్ చేయటం మరోపద్ధతి. ఈ సారి మీరు ఈ రెండో పద్ధతిని పాటించి - నా చిన్నప్పుడు ఎప్పుడో సరదాగా రేడియోలో వింటూండే 'ఉమ్మడి కుటుంబం' సినిమాలోని ఘట్టాన్ని మీ స్టేజీమీద చూపించడం... భలే గమ్మత్తుగా అన్పించింది ! యముడు, సావిత్రి రంగప్రవేశం చేసింది మొదలూ... ఆడియన్స్ పెదవులు నవ్వుల్తో విచ్చుకొనే ఉన్నాయి! దేనికదే చెప్పుకోవాలి... ఈ రెండు పద్ధతుల్లోనూ మీరు మేటి - మీ సాటిమీరే... ఘనాపాటి ! లేరెవరూ పోటీ - మీది ఏకైకధాటి ! ఈ నా మాటలకి మీ పెదవులు కూడా నవ్వుల్తో విచ్చుకుంటే సంతోషిస్తాను ! ఇంకా చెప్పాల్సిందేదో మిగిలిపోయిందని పిస్తుంది. చదివేంత ఓపికా, తీరికా మీకు ఉన్నాయా? ఇంతకీ మీ టాలెంట్‌ని చక్కగా విశ్లేషించానో లేదో ! ఈ లేఖ పోస్ట్‌లో మిస్ కాకుండా మీకు అందాలని ఆశిస్తూ -

మీ అభిమాని, శ్రేయోభిలాషి
**కిరణ్‌బాల.** 1-12-2003.

పి.యస్ : అస్సలు విషయం మరిచానండి, 'అవునొదినా'! అనేచోట రెండడుగులు ముందుకు నడిచి వెనక్కితిరిగి చూసి... తలూపుతూ క్షణంలో 'అవునొదినా'! అని అభినయించటం సూపర్బ్! 'అవునొదినా'! అనే చక్కని పలకరింపుని అంతకు తగ్గట్టుగా అప్పుడు... అక్కడ... అలా... అంతచక్కగా చూపటం నాకెంతో నచ్చింది !

(23వ టాలెంట్‌షో చూశాక....)